బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులు

నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) గుర్తింపు ఎంతో ప్రత్యేకమైనది. ఐక్యత, క్రమశిక్షణ దీని నినాదం. విద్యార్థులను పాఠశాల దశ నుంచే సైన్యంలో చేరేలా ప్రోత్సహించడం ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం. ఇది 1948లో ఏర్పడింది. స్వాతంత్ర్యానంతరం ఏర్పాటైన పండిట్ హెచ్‌ఎన్ కుంజ్రూ కమిటీ పాఠశాల, కళాశాల స్థాయిలో క్యాడెట్ సంస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. ఆ విధంగా దేశంలోని హైస్కూల్, కళాశాల స్థాయిలో చురుగ్గా, ఆరోగ్యవంతంగా ఉన్న యువతను ఎంపిక చేసి ఎన్‌సీసీ శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో నగర పరిధిలో మొట్టమొదటిగా 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ నిర్వహించేందుకు డైరెక్టరేట్ ఆమోదించింది. దీంతో ఈ నెల 23న ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభించారు.



ఎన్‌సీసీ శిక్షణకు ఎంపికైన ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు

- ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు


శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు(ఫైల్)

సీతంపేట: ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ నిర్వహణ అనుమతుల సాధనకు ఇక్కడ పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ కమాండర్ ఎం.ఎస్.వి.విశ్వనాధం ముఖ్య పాత్ర పోషించారు. గతంలో విశ్వనాధం విశాఖపట్నం జేడీ ఆఫీసర్‌గా పనిచేసే సమయంలో ఎనిమిది అవార్డులు సాధించారు. ఎన్‌సీసీ ఉన్నతాధికారులతో ఆయనకున్న సత్సంబంధాల వల్ల ప్రస్తుత ఎన్‌సీసీ ఆర్మీ కమాండర్ అజయ్‌కుమార్ ద్వారా ఢిల్లీలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జీవీఎంసీ పాఠశాలలో ఎన్‌సీసీ నిర్వహణకు అనుమతులు పొందారు. ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం అలవడుతుందని, మానసిక, శారీరక ధారుఢ్యం కలుగుతుందని, బాధ్యతాయుతమైన పౌరులుగా మారుతారని ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్ల శిక్షణ..
పాఠశాల స్థాయిలో రెండేళ్ల పాటు ఎన్‌సీసీ కోర్సు శిక్షణ తీసుకోవాల్సి ఉంది. మొదటి సంవత్సరం పాఠశాల స్థాయిలోను, రెండో సంవత్సరం పాఠశాల స్థాయితోపాటు వివిధ ట్రైనింగ్ క్యాంపులకు హాజరు కావడం, ఆర్మీలో నిర్దేశించిన డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్ సంబంధించిన విషయాల్లో శిక్షణ ఇస్తారు. అనంతరం 375 మార్కులకు మూడు గంటల వ్యవధిలో రాత పరీక్ష, 125 మార్కులకు మౌఖిక పరీక్ష ఉంటాయి. పాఠశాల స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 'ఏ' సర్టిఫికెట్ అందజేస్తారు. వారి వారి సామర్థ్యాలను బట్టి వేరు వేరు గ్రేడ్‌లు కేటాయిస్తారు. వీటి ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో ప్రాధాన్యం లభిస్తుంది.

50 మంది ఎంపిక..
ఈ హైస్కూల్‌లో చదువుతున్న 50 మంది విద్యార్థులను ఎన్‌సీసీ శిక్షణకు ఎంపిక చేశారు. 8, 9 తరగతుల విద్యార్థులకు రన్నింగ్, పుషప్స్, సిట్ అప్స్ పోటీలు నిర్వహించి, శారీరక ధారుఢ్యం ఉన్న 50 మంది విద్యార్థులను ఎన్నుకున్నారు.

ఎన్‌సీసీతో ప్రయోజనాలు..
టీచర్, రైల్వే, పోలీస్, ఆర్మీ, బ్యాంకు, ప్రైవేట్, ప్రభుత్వ రంగాల ఉద్యోగాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న వారికి గ్రేడ్‌లను బట్టి ప్రత్యేక కోటా, ప్రాధాన్యం ఇస్తుంటారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఉంటుంది.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎంతో ప్రాధాన్యం



ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం, దేశభక్తి అలవడుతుంది. మానసిక, శారీరక దారుఢ్యం పెంపొందుతుంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యం లభిస్తుంది. ఇప్పటి వరకు జీవీఎంసీ పాఠశాలల్లో ఎన్‌సీసీ నిర్వహించలేదు. తొలిసారి ఎన్జీజీవోస్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ నిర్వహణకు డైరక్టరేట్ ఆమోదిందించి. భవిష్యత్‌లో ఎన్‌సీసీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను.
– ఎం.ఎస్.వి.విశ్వనాధం, ఎన్‌సీసీ కమాండర్

యుద్ధప్రాతిపదికన గిరిప్రదక్షిణ రోడ్డు నిర్మాణం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజుతో కలిసి పనుల పరిశీలన


సీతమ్మధార అల్లూరి జంక్షన్‌లో గిరిప్రదక్షిణ రోడ్డు పనులపై చర్చిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, కె.కె.రాజు

సీతమ్మధార: రహదారుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి ఆయన సోమవారం లుంబిని పార్కు, హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఎన్జీవోస్ కాలనీ, మాధవధార, ఆర్ అండ్ బీ జంక్షన్, ఎస్ఎస్‌టీఎల్, లక్ష్మీనగర్, సింహాచలం, అడవివరం తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. సీతమ్మధార అల్లూరి జంక్షన్ నుంచి ఆర్ అండ్ బీ జంక్షన్ మారియట్ హోటల్ వరకు జరుగుతున్న గిరిప్రదక్షిణ రహదారి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గిరిప్రదక్షిణ మార్గంలోని జంక్షన్లను ఆధునికీకరించాలని, 48 బస్ రూట్ విస్తరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్ల వెంబడి వ్యర్థాలు, వినియోగంలో లేని వాహనాలు, బడ్డీలు, వస్తువులను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా పనులు
ఉత్తర నియోజకవర్గంలోని పలు సమస్యలను కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టికి కె.కె.రాజు తీసుకురాగా.. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కె.కె.రాజు మాట్లాడుతూ భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా జీవీఎంసీ సహకారంతో గిరిప్రదక్షిణ రహదారి పనులు చకచకా జరుగుతున్నాయన్నారు. పర్యటనలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోకు, అల్లు శంకరరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్.వి.సన్యాసిరావు, టౌన్ ప్లానింగ్ అధికారి అనిత, డీడీహెచ్ దామోదర్‌రావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఈఈ శ్యాంసన్ రాజు, సత్యనారాయణ రాజు, వేణుగోపాల్, రామ్మోహన్, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, ఆర్.జి.వి.కృష్ణ, మల్లయ్య నాయుడు, పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, యాత కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పిల్లి సుజాత, సీనియర్ నాయకుడు లంకా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


14వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు


25వ వార్డు సీతంపేటలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ గోవింద్

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సచివాలయం (1086122) పరిధి గురుద్వారా వెనుక రోడ్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు సోమవారం నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ బాలయ్య శాస్త్రి లేఅవుట్–2 ఏరియాలో రోడ్లు, కల్వర్టులు, డ్రైయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామమూర్తి, నాయకులు కిరణ్‌రాజు, కె.సత్యనారాయణ, చిన్నా, తులసీ, కాలనీ పెద్దలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు
సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు 134 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించనున్నారు. ఈ పనులకు సోమవారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో శంకుస్థాపన జరిగింది. సీతంపేట మెయిన్ రోడ్ జీవీకే ప్లాజా వద్ద ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో గడప గడప గడపకు మన ప్రభుత్వం జరుగుతోందని, కార్యక్రమం పూర్తి చేసిన సచివాలయానికి రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. వాటితో సచివాలయం పరిధిలో ప్రజల వినతి మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామమూర్తి, స్థానిక నాయకులు భోగవిల్లి గోవింద్, హరికృష్ణ, సమ్మెట్ల వెంకటేష్, లక్ష్మణ్‌కుమార్, అశోక్, సన్నీ, ప్రసాద్, స్థానిక మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోధనా నైపుణ్యాలపై వర్క్‌షాప్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి

సీతంపేట: బోధనా నైపుణ్యాలు, ఫలితాల ఆధారిత విద్యాభ్యాసం, పరిశోధన అంశాల్లో నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కాలేజీలో నిర్వహిస్తున్న ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. పలు కళాశాలల అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, రిసోర్స్ పర్సన్లుగా బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి వ్యవహరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అధ్యాపకులను అభినందించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సోమేశ్వరరెడ్డి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, కన్వీనర్ జె.బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'స్పందన'కు 20 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మత్రిపాలెం సెక్షన్ పరిధి 104 ఏరియా 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐటీఐ కూడలి, బాపూజీనగర్, భవాని గార్డెన్స్, శ్యామ్‌నగర్ కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నాలుగేళ్ల డిగ్రీతో ఎన్నో ప్రయోజనాలు

డాబాగార్డెన్స్: విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, విదేశాల్లో ఉన్న అవకాశాల నేపథ్యంలో నాలుగేళ్ల పాటు చదువుకునే డిగ్రీకి ఎన్నో ప్రయోజనాలున్నాయని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు తెలిపారు. నాలుగేళ్ల డిగ్రీ కోర్సులపై సోమవారం కళాశాల ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు సింగిల్ సబ్జెక్ట్ జాయిన్ అయిన విద్యార్థులున్నారని, వారందరికీ విదేశాల్లో ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. మన దేశంలో మూడేళ్ల డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వారు విదేశాల్లో ఉద్యోగాలు చేయాలంటే రెండేళ్ల పోస్టు గ్రాడ్యుయేషన్ తప్పనిసరి అవుతుందన్నారు.

'అమ్మ ఒడి' లబ్ధిదారులకు ఈకేవైసీ


అబిద్‌నగర్-01 సచివాలయంలో ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జగనన్న అమ్మ ఒడి పథకం లబ్ధిదారులకు ఈ నెల 28న పార్వతీపురం సభలో బటన్ నొక్కి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మ ఒడి అర్హులు, అనర్హుల జాబితాలు సంబంధిత సచివాలయాలకు చేరాయి. అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 27, 28 తేదీల్లో సంబంధిత లేదా సమీప సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీని సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. అనర్హుల జాబితాలో దేని వల్ల అనర్హత పొందారు కారణంపేర్కొన్నారు. దానికి సంబంధిత ధ్రువపత్రాలు అందజేస్తే మళ్లీ అప్‌లోడ్ చేస్తారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ సిబ్బంది కోరారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'

మత్రిపాలెం: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం 53వ వార్డు శివనగర్ 300 సచివాలయం పరిధి హుస్సేన్‌నగర్‌లో కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా గౌస్ ఏ పాక్ నిషానీలో ప్రార్థనలు చేశారు. అనంతరం కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. చంద్రబాబు అండ్ కో చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మడం లేదని, వారి గత పాలనంతా కాగితాలపై, పొద్దున్న పేపర్లలో మాత్రమే ఉండేదన్నారు. జగనన్న సర్కారు వచ్చాక ప్రజల చేతికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, రాష్ట్ర యూత్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పిల్లి సుజాత, పార్టీ రాష్ట్ర నాయకులు హెచ్ఐ ఫారూఖీ, కిరణ్‌రాజు, జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ కె.వి.బాబా, 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీ మెంబర్ అంబటి శైలేష్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు, 53వ వార్డు నాయకులు షేక్ బాబ్జి, సదరం జ్ఞానేష్, హనుమంతు, సుశీల, సుజాత, జయ, నబీ, అలీ, ప్రతాప్, చిరంజీవి, భోగవల్లి గోవింద్, చిన్నా, సిద్ధార్థ, వెంకటేష్, ఎర్రంశెట్టి శ్రీను, సంతోష్, అశోక్, రాము, శ్రావణ్, జీవీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


53వ వార్డులో మహిళకు కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, బర్కత్ అలీ

అలరించిన కవి సమ్మేళనం

మురళీనగర్: మాధవధార భరద్వాజ క్షేత్రంలో అమరావతి విశ్వసాహితి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆద్యంతం అలరించింది. సంస్థ గౌరవాధ్యక్షుడు పిల్లా అర్జునుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ సీహెచ్ చినసూర్యనారాయణ బాలసాహిత్యం ప్రాధాన్యం, పుట్టు పూర్వోత్తరాలను వివరించారు. నన్నయ కాలం తర్వాత శివకవులు ఈ బాలసాహిత్యాన్ని రచించారని చెప్పారు. దీని వల్ల విద్యార్థుల్లో భాషాభిమానం పెరిగి ఉత్తమ పౌరులుగా తయారవుతారన్నారు. పిల్లలకు అమ్మ భాష గొప్పతనాన్ని వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రాజమౌళి అనే విద్యార్థి తెలుగు గొప్పతనాన్ని వివరించారు. కోశాధికారి పీఎల్‌వీ ప్రసాద్ కవి సమ్మేళనం నడిపించారు. కార్యక్రమంలో ఎ.సత్యనారాయణ, ఎం.ఆనంద శర్మ, రామతాత, బి.వెంకటేశ్వరరావు, పి.ప్రాన్సిస్, కవల, డి.ఎస్.కుమార్, ఎ.సురేష్, కె.రామారావు, కె.కృష్ణ తమ రచనలు వినిపించారు.

'డ్రగ్ ఫ్రీ వైజాగ్'కు సమష్టి కృషి


'సే నో టు డ్రగ్స్' ప్రతిజ్ఞ చేస్తున్న బుల్లయ్య కళాశాల విద్యార్థులు

సీతంపేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం లంకపల్లి బుల్లయ్య కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ మైదానంలో ఎంసీఏ విద్యార్థులు ప్లకార్డులు, బ్యానర్లతో 'సే నో డ్రగ్స్', 'డ్రగ్ ఫ్రీ వైజాగ్' నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. సోషల్ సైన్సెస్ విద్యార్థులు ప్రదర్శించిన 'రెసిలెన్స్ అండ్ కరేజ్ టు సే నో డ్రగ్స్' స్కిట్ ఆలోచింపజేసింది. అనంతరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎం.వెంకటరావు విద్యార్థులకు డ్రగ్స్ వల్ల వచ్చే పరిణామాలను, డ్రగ్ అడిక్ట్, మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన చట్టం, శిక్షల గురించి వివరించారు.

ఈ సందర్భంగా డ్రగ్–ఫ్రీ ఇండియా కోసం పాటుపడతామని విద్యార్థులంతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వి.హెచ్.శ్రీకాంత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు

మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం

సీతంపేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి ఎం.ఎస్.వి.విశ్వనాధం ఆధ్వర్యంలో ఎన్జీజీవోస్ కాలనీలో జరిగిన ర్యాలీని పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు బ్యానర్, ప్లకార్డులు పట్టుకుని సే నో టు డ్రగ్స్ అంటూ నినాదాలు చేశారు. డ్రగ్స్ ఆరోగ్యానికి హానికరమని, ఇండియా డ్రగ్ ఫ్రీ దేశంగా ఉండటానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ నరస, వ్యాయామ ఉపాధ్యాయులు సునంద్, సీఆర్‌పీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

డ్రగ్స్ వినియోగం నేరం

మహారాణిపేట: మాదక ద్రవ్యాలు సేవించడం చట్టరీత్యా నేరమని, ఈ కేసులకు ఎలాంటి రాజీ లేదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అన్నారు. సోమవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ అనాటమీ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం కేసుల విచారణ జరుగుతుందన్నారు. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిచడం కోసం తాము ప్రయత్నం చేస్తున్నామన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంటు డైరెక్టర్ జె.మాధవి మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం అస్తవ్యవస్తమవుతుందన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మజ్జి వినీష, ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్మథరావు, వైద్యులు పాల్గొన్నారు.

సముద్ర జీవుల మనుగడ ప్రధానం


మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో యూరోపియన్ కమిషన్ ఆధ్వర్యంలో 'సూక్ష్మ ప్లాస్టిక్, విశ్లేషణ, నియంత్రణ, నిర్వహణ విధానాలు' అనే అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. యూనివర్సిటీకి అందించిన పరిశోధన ప్రాజెక్టులో భాగంగా 15 మందికి ఈ అంశంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ సముద్ర జీవుల మనుగడ ఎంతో ప్రధానమన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా తీవ్ర నష్టం జరుగుతోందని, దీనిని నియంత్రించే విధానాలపై అధ్యయనాలు చేయాలని సూచించారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం కన్వీనర్‌గా, గౌరవ ఆచార్యులు కె.ఉమాదేవి సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం ఆచార్య ఇ.ఉదయ భాస్కరరెడ్డి, ఆచార్య సాల్మన్ రాజు, ఆచార్య మురళీకృష్ణ కుమార్, రవి ఈశ్వరపు తదితరులు ప్రత్యేక ప్రసంగాలు చేశారు. విభాగ అధ్యాపకులు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు.

పాఠశాలల భవనాలపై దృష్టి సారించండి


శాంతినగర్‌లోని ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న గొండు సీతారాం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్ర భవనాలపై దృష్టి సారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. 46వ వార్డు కైలాసపురం దరి శాంతినగర్‌లోని వాసుదేవ నగర్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని సోమవారం ఆయన సందర్శించారు. 1983లో నగర పాలక సంస్థ నిర్మించిన ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడైనా కూలిపోయే అవకాశముందని, వెంటనే ఇటువంటి స్కూళ్ల విషయంలో చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పరిసర ప్రాంతాల వారు చేసిన ఫిర్యాదుల మేరకు ఈ పాఠశాలను పరిశీలించేందుకు వచ్చినట్లు సీతారాం తెలిపారు. పిల్లలు విద్యా సంవత్సరం కోల్పోకుండా ప్రత్యామ్నాయ తరగతి గదులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి, జీవీఎంసీ అధికారులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నుంచి సూచనలు జారీ చేయనున్నట్లు చెప్పారు. ఈ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, ఇతర విషయాలను స్కూల్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సువర్ణ.. హెచ్‌ఎం ఎస్.వరహాలబాబును అడిగి తెలుసుకున్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణికుమారి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ భాగ్యలక్ష్మి, వార్డు సచివాలయాల మహిళా, విద్యా, ఆరోగ్య, రెవెన్యూ సంక్షేమ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ తొలేళ్ల సంబరం


తొలేళ్ల వేడుకల్లో పాల్గొన్న సంపంగి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు

సీతంపేట: బీటీఆర్ కాలనీలో కొలువైన కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారి తొలేళ్ల సంబరం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సీతంపేట, రాజేంద్రనగర్, గణేష్ నగర్, హరిజన వీధి, కనకమ్మ వీధి ప్రాంతాల్లో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. మేళతాళాలు, సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, మొక్కులు సమర్పించారు. సింహాచలం దేవస్థాన ట్రస్టు బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఉత్సవ విగ్రహానికి తొలి పూజ నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. మంగళవారం ప్రధాన పండగ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అలజంగి జగన్, దువ్వ పైడితల్లి, పాలేపు ధనాజి గౌడు, ప్రధాన కార్యదర్శి ఇమంది చిన్న, పాలవలస అప్పలనాయుడు, బొమ్మాళి రవి, జి.సన్యాసిరావు, గౌరి, అలజంగి కాంతారావు, వానపల్లి రమేష్, ముద్దాడ వాసు, బి, కనకరాజు, ఎం.నగేష్, ఎస్.కె.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈకార్వో సమ్మర్ క్యాంప్


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి, ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో మే 1 నుంచి నిర్వహించిన సమ్మర్ క్యాంప్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రైల్ క్లబ్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి.. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన, పాల్గొన్న వారిందరికీ ఈకార్వో సభ్యుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. రైల్వే ఉద్యోగుల పిల్లలు, బయటి వారి పిల్లలకు కీబోర్డు, శాస్త్రీయ సంగీతం, చెస్, డ్రాయింగ్, పెయింటింగ్, డాన్స్, కరాటే, ఇంగ్లిష్ పరిజ్ఞానం వంటి అంశాల్లో శిక్షణ నిచ్చారు. సుమారు 600 మంది చిన్నారులు పాల్గొన్నట్లు ఈకార్వో ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్లు కవితా గుప్తా, మధుస్మిత సాహూ, సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.